



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక






సంపుటి: 5 సంచిక: 335, పేజీలు - 08

సోమవారం, మే 25, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


## తెలంగాణ మహిళలకు సీఎం కానుక

**- నేటి నుంచే ప్రారంభం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు

2లో..

## కాక్రోచ్ వేవ్.. రాజకీయ పార్టీలకు షాక్

- కాక్రోచ్ కి ఊహించని స్పందన
- జనతా పార్టీకి జనమే బలం
- ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్ అయ్యిందన్న అభిజీత్ దీప్కే




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాక్రోచ్ జనతా పార్టీ ఊహించని విధంగా జనంలోకి వెళ్లింది. కోట్లాది మంది యువత దీనికి కనెక్ట్ అయ్యారు. కాక్ రోచ్ జనతా పార్టీకి సోషల్ మీడియాలో అనూహ్య స్పందన లభిస్తుంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ ఈ సీజేపీ అంటే నే భయపడిపోతున్నాయి. ఒక్కసారిగా ఉద్యమంలా దీనికి ఫాలోవర్స్ సంఖ్య కూడా భారీగా పెరిగారు. కాక్ రోచ్ జనతా పార్టీ బ్యాకప్ ఖాతాకు 2.02 లక్షల మంది అనుచరులు ఉండగా, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 2.19 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. డిజిటల్ వేదిగా ఉన్న కాక్ రోచ్ జనతా పార్టీ ఐదు అంశాలతో మ్యానిఫేస్టోలతో ప్రజల ముందుకు వచ్చింది.

### అనేక హామీలతో

దేశంలో జరుగుతున్న అనేక పరిణామాలపై సీజేపీ హామీలను ఇచ్చింది. కాక్ రోచ్ జనతా పార్టీని అభిజీత్ దీప్కే ను ప్రారంభించగా ఒక్కసారిగా యువత నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. దేశంలో నిరుద్యోగ యువత అంతా ఏకమై దీనికి మద్దతుగా నిలుస్తున్నారు. మరొకవైపు కాక్‌రోచ్ జనతా పార్టీ పై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. తమ సోషల్ మీడియా ఖాతాలన్నింటిపైనా వరుసగా ఆంక్షలు, హ్యాకింగ్ ఘటనలు జరిగాయని చెప్పారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో తన వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కూడా హ్యాక్ అయ్యిందని దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థకు చెందిన ఏ సోషల్ మీడియా ఖాతాపైనా తమకు నియంత్రణ లేదన్నారు.

### పేజీ హ్యాక్ అయిందంటూ

"కాక్‌రోచ్ జనతా పార్టీపై చర్యలు కొనసాగుతున్నాయి.

2లో..

## కేంద్రం ప్రజలకు 'స్లో పాయిజన్' ఇస్తోంది

**- కేజ్రీవాల్ సంచలనం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. చమురు, గ్యాస్ రవాణా నిలిచిపోయింది. దాంతో ప్రపంచ దేశాలతోపాటు భారత్ లోనూ ఇరాన్-అమెరికా యుద్ధ సెగలు తాకుతున్నాయి. అయితే వారం రోజుల వ్యవధిలోనే చమురు సంస్థలు మూడు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. అయితే దేశంలో వరుసగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, ఎల్ పీజీ ధరలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వీడియో పోస్ట్ చేశారు. గత 10 నుంచి 15 రోజుల్లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్

2లో..



## లేబర్ అడ్డాలతో ఏపీలో నూతన అధ్యాయం

**- కార్మికుల నైపుణ్యాలకు పదును పెట్టేలా స్కిల్ ట్రైనింగ్**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాణంలో వెన్నెముకలా నిలిచే సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో విప్లవాత్మక అడుగులు వేసింది. కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన దార్శనికతతో పునరుద్ధరించారు. కార్మికులకు నైపుణ్య శిక్షణ (స్కిల్ అప్గ్రేడ్) ఇప్పించడంతో పాటు, సమాజంలో వారి గౌరవాన్ని పెంచేలా లేబర్ అడ్డాల నిర్మాణం, వైద్య సంరక్షణ కోసం సరికొత్త ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటు వంటి చర్యలతో కూటమి ప్రభుత్వం కార్మికులకు కొండంత అండగా నిలిచింది.

### మౌలిక వసతులతో 'లేబర్ అడ్డాల' ఏర్పాటు

ఉపాధి కోసం కూడళ్లలో ఎండనక, వాననక నిలబడే దినసరి కూలీల కష్టాలకు పరిష్కారంగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి నగరాలతో పాటు ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ఆధునిక లేబర్ అమెనిటీస్

2లో..

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు

**- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్**

- వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్
- ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ
- మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య
- గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ అంబర్‌పేటలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ఉచిత విద్యుత్తు రద్దు కోసమే మోటర్లకు మీటర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని పూర్తిగా అదానీ వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపణలు చేశారు. మోటర్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతన్నలకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ఎత్తగొట్టే కుట్ర చేస్తుందని విమర్శించారు.ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న మీటర్లు తొలగించి

2లో..

## ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం

- పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ
- యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌ల సరఫరాకు కొంత సమయం
- వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్న మంత్రి నారా లోకేష్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విష ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

## జొన్న, మొక్కజొన్న పంటలు తక్షణమే కొనుగోళ్లు

**- రైతులను కాపాడాలని సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మొక్కజొన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో పండిన మొక్కజొన్న కొనుగోళ్లపై కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వమే రంగంలోకి దిగింది. మొక్కజొన్న పంటను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన రూ. 4,000 కోట్లకు అదనంగా, సీఎం రేవంత్ మరో రూ. 1,800 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారని మంత్రి తెలిపారు.

### మొక్కజొన్న కొనుగోళ్లను తక్షణమే..

ఈ ఏడాది రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న అత్యంత భారీగా దిగుబడి వచ్చింది. ఈ క్రమంలో రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు, రూ. 1,100 కోట్లతో మొక్కజొన్న కొనుగోళ్లను

2లో..

## 'గ్రావిటీ హోల్'.. వీడిన మిస్టరీ!

**- హిందూ మహాసముద్రంలో భారీ అగాథం రహస్యాన్ని ఛేదించిన శాస్త్రవేత్తలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హిందూ మహాసముద్రంలో, ముఖ్యంగా భారతదేశానికి నైరుతి దిశలో, ఓ భారీ 'గ్రావిటీ హోల్' ఉన్న విషయం చాలాకాలంగా శాస్త్రవేత్తలకు తెలుసు. ఇది నిజమైన గొయ్యి కాదు, గురుత్వాకర్షణ శక్తి చాలా బలహీనంగా ఉన్న ప్రాంతం. ఈ భౌగోళిక అద్భుతం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు జరిపిన పరిశోధనల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. భూమి అంతర్భాగంలోని సంక్లిష్ట ప్రక్రియలే దీనికి కారణమని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దాదాపు 30 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో, భూ గురుత్వాకర్షణ శక్తి సాధారణం

2లో..

## పాకిస్థాన్‌లో రక్తపాతం

- ప్యాసింజర్ రైలుపై ఆత్మాహుతి దాడి
- 24 మంది మృతి, 50 మందికి పైగా గాయాలు
- మృతుల్లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు



**బలూచిస్థాన్ (ప్రశ్న న్యూస్)** పాకిస్థాన్‌లో ఒక భయంకరమైన ఆత్మాహుతి దాడి జరిగింది. క్వెట్టా పరిధిలోని చమన్ ఫాటక్ రైల్వేస్టేషన్‌కు అత్యంత సమీపంలో జరిగిన ఈ విస్ఫోటనంలో 24 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో 50 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఆర్మీ

2లో..

## ఎల్ & టీ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం

**- కాలి బూడిదైన మేడిగడ్డ కీలక పత్రాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బ్యారేజ్ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కార్యాలయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు ఆఫీస్ అంతటా వ్యాపించడంతో ఆ ప్రాంతాన్ని దట్టమైన పొగలు కమ్మేశాయి. ఈ ప్రమాదంలో మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణానికి, దానికి సంబంధించిన నిర్వహణ పనులకు చెందిన పలు కీలక డాక్యుమెంట్లు, ఫైళ్లు పూర్తిగా కాలి బూడిదైనట్లు ప్రాథమిక సమాచారం. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్ల కుంగుబాటు వ్యవహారంపై ఇప్పటికే వివాదం నడుస్తున్న తరుణంలో, దానికి సంబంధించిన రికార్డులు ఉన్న కార్యాలయంలోనే ఈ ప్రమాదం జరగడం తీవ్ర కలకలం రేపుతోంది.ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదం కేవలం ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, లేక దీని వెనుక మరేదైనా కుట్ర కోణం ఉందా అనే దిశగా పోలీసులు, ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటు, అవకతవకలపై ఆరోపణలు, కోర్టు కేసులు, పునరుద్ధరణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి.

### కోర్టు కేసులు, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయంటూ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసింది. ప్రాజెక్టు బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను ప్రశ్నించి పలు వివరాలు సేకరించి ఘోష్ కమిషన్ నివేదిక అందించింది.

2లో..

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో
# ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



నారాయణవనం(ప్రశ్న న్యూస్) శ్రీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంవరకు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మే 28 నుండి జూన్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


# అన్నప్రసాద వితరణ పరిశీలన
## – ఈవో ఎం శ్రీనివాసరావు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు అన్నప్రసాద వితరణను పరిశీలించారు. ముందుగా అన్నప్రసాద వితరణ భవనంలోని విరాళాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. తరువాత అన్నప్రసాదవితరణ గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాలను స్వయంగా వడ్డించారు. అన్న ప్రసాదాలను స్వీకరిస్తున్న పలువురు భక్తులతో నేరుగా మాట్లాడుతూ అన్నప్రసాదాల వడ్డన, రుచి మొదలైన అంశాల గురించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పరిశీలనలో భాగంగా అధికారులతో మాట్లాడుతూ అన్నప్రసాదవితరణలో శివసేవకుల సేవలను విరివిగా వినియోగించుకోవాలన్నారు. అన్నప్రసాదాల వడ్డన తదితర అంశాలపై శివసేవకులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. ప్రతీహాలులో కూడా అన్నప్రసాదాల వడ్డన సజావుగా జరిగేటట్లు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. వండిన ప్రతీ వంటకం కూడా ప్రతీ భక్తుడికి చేరేవిధంగా పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతీ హాలును కూడా సిబ్బంది ప్రత్యేకంగా నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు.

అన్నప్రసాదవితరణలో వంటకాలను రుచికరంగా ఉండేవిధంగా అన్నీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను మాత్రమే వాడుతుండాలన్నారు. అదేవిధంగా అన్నప్రసాదవితరణ వంటశాలలోనూ, ప్రసాదవితరణ చేసే హాలులలోనూ భవన ప్రాంగణములో శుచీ శుభ్రతపట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు.

# ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా నిరంతర పర్యవేక్షణ: కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ(ప్రశ్న న్యూస్) నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం సాయంత్రం నగరంలో కురిసిన వర్షాలు, ఈదురు గాలుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖాధిపతులతో వైర్లెస్ సెట్ ద్వారా నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాలలో రోడ్లపై నీరు నిల్వ ఉండే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీరు నిల్వ లేకుండా తక్షణ చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద ప్రత్యేక దృష్టి సారించి మోటార్లు, డ్రైనేజీ వ్యవస్థలను వినియోగించి నీటిని తొలగించే చర్యలు కొనసాగించారు.మరోవైపు ఈదురు గాలుల ప్రభావంతో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలు, చెట్ల కొమ్మలు కూలిన ఘటనలను అధికారులు వెంటనే గుర్తించి, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు.

# గంగపుత్ర కార్పొరేషన్ వెంటనే ప్రకటించాలి
## బిజ్జి శత్రువు రావును చైర్మన్‌గా నియమించాలి



జగిత్యాల ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ కుల సంఘాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్ల నియామకాలకు ఉత్తర్వులు జారీ చేస్తున్న నేపథ్యంలో గంగపుత్ర కార్పొరేషన్‌ను కూడా తక్షణమే ఏర్పాటు చేసి, ఆ కార్పొరేషన్‌కు బీజ్జ శత్రువు గంగపుత్రను చైర్మన్‌గా నియమించాలని పల్లికొండ ప్రవీణ్ డిమాండ్ చేశారు. గంగపుత్ర, గుండ్ల బెస్త మరియు మత్స్యకార వర్గాల అభివృద్ధి కోసం బిజ్జీ శత్రువు రావు గంగపుత్ర ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో మత్స్యకార వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా బీజ్జ శత్రువు గంగపుత్ర గారికి మంచి గుర్తింపు ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి గంగపుత్ర కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా బీజ్జ శత్రువు గంగపుత్ర గారు చేపట్టిన పలు కీలక బాధ్యతలను ప్రస్తావిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధికార ప్రతినిధిగా, సూర్యాపేట జిల్లా ఇంచార్జిగా, వనపర్తి జిల్లా ఇంచార్జిగా, అఖిల భారత మత్స్యకార కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ మరియు పుదుచ్చేరి రాష్ట్రాల ఇంచార్జిగా, ఫిషర్మెన్ కమిటీ కార్యదర్శిగా, మాజీ రైల్వే సభ్యుడిగా, భారత ప్రభుత్వం మాజీ వినియోగదారుల ఫోరం సభ్యుడిగా సేవలు అందిస్తూ మత్స్యకార వర్గాల అభ్యున్నతికి నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. మత్స్యకార కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన బడ్జెట్ కేటాయించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లికొండ ప్రవీణ్, మాజీ డీఎఫ్‌సీఎస్ చైర్మన్, జగిత్యాల. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ కార్యదర్శి. తో పాటు మెట్పల్లి గంగపుత్ర మండల కమిటీ అధ్యక్షులు కాంతి హరి కుమార్ తో పాటు వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు కుల సభ్యులు పాల్గొనడం జరిగింది .

# ఎబోలా’పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం
## - ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**-కాంగో, ఉగాండా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు వైద్య పరీక్షలు చేసేలా చర్యలు**

**-విశాఖ, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ విమానాశ్రయాలపై ప్రత్యేక దృష్టి**

**అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ విస్తృతి, కేసులు, మరణాల నమోదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ‘ఏబోలా’ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీచేసిన హెచ్చరికలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ప్రత్యేక మార్గదర్శకాలు, సలహాలు, సూచనల ఆధారంగా ‘ఎబోలా’ వైరస్ వ్యాప్తి, కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని మంత్రి ప్రకటించారు. ఆఫ్రికాలోని కాశీగో, ఉగాండా దేశాల్లో ఎబోలా తీవ్రత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సదరు దేశాల నుంచి రాష్ట్రంలోనికి వైజాగ్, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల ద్వారా వచ్చే ప్రయాణికులు, పర్యాటకులను ((ట్రావెల్ హిస్టరీ ఆధారంగా) వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసే విషయంలో ఎయిర్ పోర్ట్ అథార్టీ, సదరు జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు. వైరస్ లక్షణాలు కలిగిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి, పక్కనున్న వారికి కూడా వెంటనే వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. విశాఖ ఓడరేవు అధికారులతో కూడా మాట్లాడి, ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించామని చెప్పారు. విమానాల ద్వారా కాకుండా రోడ్డు మార్గాల ద్వారా వచ్చే వారి విషయంలోనూ అవసరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎబోలా వైరస్ పీడిత దేశాల నుంచి దేశంలోని వచ్చే ప్రయాణికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ఇందుకు అనుగుణంగా అవసరమైన సమాచారాన్ని సదరు రాష్ట్రాలకు పంపుతోందని తెలిపారు. కొవిడ్ హయాంనాటి అనుభవాలు దృష్టిలో పెట్టుకుని ‘ఏబోలా’ విషయంలో ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితులు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై ‘యాక్షన్ ప్లాన్’ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం ఆశ వర్కర్ల నుంచి స్థాయి నుశీచి అందర్నీ ‘వర్చువల్’ సమావేశాల ద్వారా అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

### ఐసోలేషన్ వార్డులు సిద్ధం!

అంతర్జాతీయ విమానాశ్రయాల నగరాల్లోని టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే ‘ఐసోలేషన్’ వార్డుల్లో 15 పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి వస్తున్న సమాచారాన్ని జిల్లాలకు పంపుతూ అందర్నీ అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. పీపీఈ , వైరస్ నిర్ధారణ పరీక్షల కిట్లు తక్షణ అవసరాలకు సరిపడ ఉన్నాయని తెలిపారు.

### ప్రయాణాలు చేయకపోవడం మంచిది!

కేంద్ర ప్రభుత్వం జారీచేసిన అడ్వయిజరీ మేరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప, కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు ప్రయాణించొద్దని మంత్రి స త్యకుమార్ విజ్ఞప్తిచేశారు. గత మూడు వారాల కిందట ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారు అనారోగ్యంగా ఉంటే జిల్లా అధికారులకు సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి ప్రజలకు సూచించారు. దీనివల్ల అవసరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

### లక్షణాలు!

ఎబోలా (బుండిబుగ్యో) వైరస్ కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాల్లోని అనేకమందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం కష్టం. వైరస్ సోకిన వారికి కొన్నివారాలపాటు లక్షణాలు బయటపడవు. దీనివల్ల ఎక్కువ మందికి తక్కువ వ్యవధిలో సోకే అవకాశం ఉంది. సాధారణ జ్వరం, అకస్మాత్తుగా జ్వరం పెరిగిపోవడం, శరీరం మొత్తం బలహీనంగా అనిపించడం, తీవ్ర తలనొప్పి, గొంతునొప్పి, కండరాల నొప్పులు, రోజురోజుకి నొప్పులు తీవ్రమవుతుండటం, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్ల ఎర్రబారడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ బారినపడిన వారిలో కనిపిస్తున్నాయి. అని తెలిపారు

## వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీని
# ఎప్పటికి నమ్మొద్దు : ఉదయనిధి స్టాలిన్



చెన్నై : వీసీకే అధినేత, సీఎం విజయ్ మైనారిటీ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంపై డీఎంకే నాయకుడు, యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ ఆ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ..డీఎంకే కార్యకర్తల మద్దతు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంతో సీట్లు గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్ నాయకులలో కనీస కృతజ్ఞత, మర్యాద కూడా లేదని మండిపడ్డారు. అధికారం కోసం పార్టీని నమ్మించి వెన్నుపోటు పొడిచే కాంగ్రెస్‌ను డీఎంకే క్యాడర్ ఎప్పటికీ నమ్మకూడదని, వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దని పిలుపునిచ్చారు.దకాంగ్రెస్ ఐదుగురు ఎమ్మెల్యేలను గెలవడానికి డీఎంకే కార్యకర్తలే కారణమన్నారు. ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకున్నందుకే వారికి ఓటు వేశారు. కానీ ఈరోజు, కొన్ని పదవుల కోసం, మాకు సమాచారం ఇవ్వకుండా వారు పారిపోయారు. తమిళనాడు ప్రజలు వారికి అతి త్వరలోనే తగిన గుణపాఠం నేర్పిస్తారన్నారు. భారతదేశవ్యాప్తంగా బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్సే కారణమని కూడా ఆయన ఆరోపించారు. ఇన్నాళ్లు మోదీ, అమిషా వల్ల కాంగ్రెస్ ఓడిపోయింది అనుకున్నామని కానీ, నేటి పరిస్థితులు చూస్తుంటే కేవలం కాంగ్రెస్ మోసపూరిత విధానాల వల్లే దేశంలో బీజేపీ గెలుస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ గెలిచిన సీట్లు కూడా కేవలం స్టాలిన్ పెట్టిన భిక్షేనని గుర్తు చేశారు. జెన్ జెడ్ యూత్‌కు రాజకీయంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే తొలిసారి ఓటు వేసిన వారికి కూడా రాజకీయ చైతన్యం కల్పించాలని డీఎంకే యువజన విభాగం నేతలకు సూచించారు.

## తడిసిన ధాన్యాన్ని
# ప్రభుత్వం కొనుగోలు చేయాలి



**వనపర్తి** : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. వనపర్తి మార్కెట్ యార్డులో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు సంఘీభావం తెలిపి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోజుల తరబడి కల్లాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా కాంటా పెట్టడం లేదని మండిపడ్డారు. కండ్లముందే ధాన్యం నీటి పాలవుతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలేని ట్రాన్‌పోర్ట్ ఏజెన్సీలకు కాంటాక్టులు ఇవ్వడం వల్ల రైతులకు ఈ దుస్థితి దాపురించిందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలపై కేసులు పెట్టడం చేతనైతది కానీ శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేండ్లు అయిన నేటికి హంతకులను పట్టుకోకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మొత్తం ధాన్యం కొనుగోలు చేశాం అని బాధ్యతారహితంగా ప్రకటనలు చేశార్నారు. కేసీఆర్ హయాంలో తడిసిన ధాన్యాన్ని ప్రతి గింజా కొని రైతులను ఆదుకున్నారురని గుర్తు చేశారు. 5లక్షల 42వేల హెక్టార్లలో ధాన్యం పండింది. కానీ కొనే నాథుడేలేడన్నారు. సివిల్ సప్లైస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర అర్హతలేని ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కో మిల్లర్ మంత్రి కుమారునికి రేంజ్ రోవర్ కార్ బహుమతిగా ఇచ్చారని, దీనిపై విచారణ చేపట్టాలన్నారు. పక్షపాతం చూపకుండా అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలన్నారు. కోటి నలభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మార్కెట్ కు వస్తుంది. 45లక్షల మక్కజొన్న మార్కెట్ కు వచ్చింది. రైతులను గాలికి వదిలేసిన చరిత్ర రేవంత్ రెడ్డిది అని మండిపడ్డారు. అక్రమార్కులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 90శాతం ధాన్యం ఆరు పెద్ద మిల్లులకు పోతుందన్నారు. 90శాతం పాడి ఆరు పెద్ద మిల్లులకు పోతుంది విచారణ చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మార్కెట్ మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, పలుస రమేష్ గౌడ్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాణిక్యం, వనం రాములు, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, సయ్యద్ , జెమిల్, బాగ్యరాజ్ తదితరులు ఉన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో విషాదం..
## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి




హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విక్రమ్(27), అనిల్(30) అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సంగారెడ్డి జిల్లాలో దారుణం..
## – భర్తను చంపి జేసీబీతో గొయ్యి తీసి పూడ్చిపెట్టిన భార్య



హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను ప్రయుడితో కలిసి హతమార్చింది. ఈ విషాదకర సంఘటన నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన ముత్యం రెడ్డి భార్య వివాహేతర సంబంధానికి అడ్డువస్తాడని భావించి ప్రియుడు చింటుతో కలిసి అంతమొందించాలని భావించింది. అందులో భాగంగా ప్రియుడు, ఆమె కలిసి భర్తను చంపి జేసీబీతో గొయ్యి తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. అనంతరం భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో 9 రోజుల తర్వాత నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

# యాదగిరిగుట్టపై యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు ఆందోళన



యాదగిరిగుట్ట, మే24 : యాదగిరిగుట్టపై వర్తక సంఘాన్ని రద్దు చేయాలంటూ ఆదివారం యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆందోళన చేపట్టింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్వామి వారి వైకుంఠ ద్వారం వరకు ర్యాలీ నిర్వహించారు. దేవస్థాన అధికారులు వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లకు పిలవాలని డిమాండ్ చేశారు. పాత బస్ స్టాండ్ వద్ద రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు. ఈ నెల 31 వ తేదీన వర్తక సంఘం గడువు ముగిసిపోతుందని, వెంటనే కొండపైన దుకాణాలకు టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. టెండర్లు వేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. సెలవు దినం కావడంతో భారీగా భక్తుల వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న సభ్యులను పోలీసులు చెదరగొట్టారు.

## డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సమస్యలపై మాజీ మంత్రి హరీష్ రావుకు వినతి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు కు డబుల్ బెడ్‌రూమ్ కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు సహకారంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డబుల్ బెడ్‌రూమ్ కమిటీ అధ్యక్షుడు దయాకర్, కమిటీ సభ్యులు ఆదివారం హరీష్ రావును కలిసి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సమస్యలపై ఎన్నిసార్లు అధికారులను కలిసినా సరైన స్పందన లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మారుతున్నా సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని, కార్యాలయాలకు వెళ్లిన లబ్ధిదారులను సిబ్బంది సరైన విధంగా చూడడం లేదని విమర్శించారు. నివాసాల మధ్యే స్మశాన వాటిక ఉండటం, చుట్టుపక్కల చెత్త పేరుకుపోవడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంకా పలువురు లబ్ధిదారులకు ఇండ్లు పూర్తిగా అందజేయలేదని, పట్టాల పంపిణీ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వీధిలైట్లు లేవని, రహదారుల వెంట బట్టర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటినీ మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ కమిటీ అధ్యక్షుడు దయాకర్, కమిటీ సభ్యులు బిక్షపతి, శివ, రాజు, తాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన

### - కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



వట్టిచెరుకూరు(ప్రశ్న న్యూస్ )మండలం, చింతపల్లిపాడు గ్రామంలో తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని చాటిచెప్పిన మహనీయులు స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ఆవిష్కరించిన అనంతరం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి, తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు,చిన్నారులు తదితరులు పాల్గొని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కి, ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు కి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమసాని చంద్రశేఖర్ గారితో కలిసి చింతపల్లిపాడు గ్రామంలో రూ.10 లక్షల యం జి యన్ ఆర్ ఈ జి యస్ గ్రాంటు నిధులతో అంతర్గత సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారు మాట్లాడుతూ.తెలుగు ప్రజల గౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటిచెప్పిన మహానేత అన్న నందమూరి తారక రామారావు అని కొనియాడారు. రాజకీయాల్లో ప్రజాసేవకు కొత్త దిశానిర్దేశం చేసిన దూరదృష్టి నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత మరియు తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి ఆదర్శమని, యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని తెలిపారు.ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశస్థాయిలో నిలబెట్టిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సినీ రంగంలో అగ్ర నటుడిగా కోట్లాది అభిమానులను సంపాదించుకున్న ఆయన, రాజకీయాల్లో ప్రవేశించి పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు.రూ.2 కిలో బియ్యం, మహిళల సంక్షేమం, రైతు సంక్షేమం వంటి అనేక పథకాల ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలుగు ప్రజల కోసం జీవితాంతం సేవ చేసిన ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించడం ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాధ్యత అని అన్నారు.స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు ఆశయం మేరకు ప్రియతమ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని అని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించి విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ పేరు, పేరునా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , ఏపీ టీఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ , తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యారావు , గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు , ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ , పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి కొప్పుల

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో తాటి వనాలు కాలిపోయిన నేపథ్యంలో గీత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం ధర్మారం శివారులోని సలాంద్రి సమీపాన ఉన్న తాటి వనాలు అగ్ని ప్రమాదంలో ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఈశ్వర్ ఆదివారం కాలిన తాటి వనాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఎకరాలలోని తాటివనాలు అగ్ని ప్రమాదంలో కాలిపోవడం బాధాకరమన్నారు. తాటి వనాలు కాలిపోవడంతోస్థానిక గీత కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు తగిన పరిహారం అందజేసి కాలిపోయిన తాటి వనాల స్థానంలో కొత్త వనాలను పెంచాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గీత కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉందని మాజీ సీఎం కేసీఆర్ 5 కోట్ల తాటివనాలను పెంచారని ఈశ్వర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఈశ్వర్ వెంట నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, పార్టీ ధర్మారం పట్టణ తాజా మాజీ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు, నాడెం శ్రీనివాస్, గాజుల రాజు, ఆవుల లత, కాంపల్లి అపర్ణ, గుజ్జేటి కనక లక్ష్మి, మార్క సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# జీవితమంటే గమ్యం కాదు... గమనం

మానవ జీవితం అనేది పుట్టిన క్షణం నుండి మరణించే వరకు సాగే ఒక నిరంతర, అద్భుతమైన ప్రయాణం. ఈ సుదీర్ఘ పయనంలో మనిషి నిరంతరం ఏదో ఒక లక్ష్యం కోసం పరిగెడుతూనే ఉంటాడు. బాల్యంలో పాఠశాల విద్యను పూర్తి చేయాలని, యుక్తవయసులో మంచి ఉద్యోగం సాధించి స్థిరపడాలని, మధ్యవయసులో ఆర్థికంగా ఎదగాలని, వృద్ధాప్యంలో ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలని ఇలా ఒక గమ్యం తర్వాత మరొక గమ్యాన్ని నిర్దేశించుకుంటూ జీవితాంతం పరుగుపెడుతూనే ఉంటాడు. అయితే, ఈ పరుగుల లంకెలో మనం ఒక చేదు నిజాన్ని, పరమ సత్యాన్ని తరచుగా మరచిపోతుంటాం. ఏదైనా ఒక గమ్యాన్ని ముద్దాడినప్పుడు మనకు లభించే ఆనందం కేవలం కొన్ని రోజులు లేదా కొన్ని క్షణాలు మాత్రమే మిగులుతుంది. కానీ, ఆ గమ్యాన్ని చేరుకోవడానికి మనం వేసిన ప్రతి అడుగు, ఆ సుదీర్ఘ పయనంలో మనం పొందిన రకరకాల అనుభవాలు, నేర్చుకున్న అమూల్యమైన పాఠాలు, మనకు పరిచయమైన వైవిధ్యభరితమైన మనుషులు మాత్రమే జీవితాంతం మన గుండెల్లో పదిలంగా నిలిచిపోతాయి. అందుకే మన పెద్దలు, లబ్దప్రతిష్ఠులైన జ్ఞానులు ఎంతో అనుభవంతో చెప్పారు. గమ్యం కన్నా గమనం గొప్పది. ఈ చిన్న వాక్యం వెనుక కేవలం తాత్విక చింతన మాత్రమే లేదు. ఇది మన నిత్య జీవితంలో ప్రతిరోజూ, ప్రతిక్షణం రుజువవుతున్న ఒక అక్షర సత్యం. ఉదాహరణకు, ఒక విద్యార్థి కష్టపడి చదివి పరీక్షలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణుడైనప్పుడు పొందే ఆనందం కంటే, ఆ పరీక్షకు సిద్ధమవడానికి అతను నిద్రమాని శ్రమించిన రాత్రులు, తన స్నేహితులతో కలిసి సందేహాలను నివృత్తి చేసుకున్న క్షణాలు, కఠినమైన సమస్యలను ఛేదించినప్పుడు అతని మెదడు పొందిన మేధోసంతోషం ఇవే అతని వ్యక్తిత్వాన్ని, భవిష్యత్తును మలిచే అసలైన శక్తులు. గమ్యం అనేది కేవలం ఒక తాత్కాలిక బిరుదును లేదా సర్టిఫికెట్‌ను మాత్రమే ఇస్తుంది, కానీ ఆ గమనం ఒక పరిపూర్ణమైన మనిషిని తయారు చేస్తుంది. గమ్యం చేరుకోవడం అనేది కేవలం ఒక రోజు వేడుక లాంటిది అయితే, ఆ గమనం అనేది జీవితాంతం మనల్ని నడిపించే ఒక పెద్ద విశ్వవిద్యాలయం. ఈ విశ్వవిద్యాలయంలో ప్రతి పాఠాన్ని శ్రద్ధగా నేర్చుకున్నవాడే నిజమైన విజేతగా నిలుస్తాడు. చరిత్ర పుటలను తిరగేసి, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన గొప్ప గొప్ప సాధకుల జీవితాలను మనం నిశితంగా పరిశీలిస్తే ఈ సత్యం మరింత స్పష్టంగా, సుమధురంగా ఆవిష్కృతమవుతుంది. మహాత్మా గాంధీ భారత దేశానికి స్వాతంత్ర్యం (స్వరాజ్యం) తీసురావడమే ఆయన ప్రధాన గమ్యం. కానీ ఆ గమ్యం కంటే, ఆ స్వాతంత్ర్యం కోసం ఆయన ఎంచుకున్న సత్యం, అహింస అనే మార్గాలు, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఎన్నో ఏళ్ళ కారాగారవాసాలు ఈ గమనమే భారతీయ సమాజాన్ని, ప్రపంచ చరిత్రను శాశ్వతంగా మార్చివేశాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది కాలానికే ఆయన భౌతికంగా మనకు దూరమయ్యారు, కానీ ఆయన సాగించిన ఆ వీరోచిత గమనం నేటికీ కోట్ల మందికి ఆదర్శంగా నిలుస్తోంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆయన భారత రాజ్యాంగ నిర్మాత అయ్యారు, అది ఆయన చేరుకున్న గమ్యం. కానీ ఆ శిఖరాన్ని చేరడానికి ముందు ఆయన సమాజంలో అనుభవించిన తీవ్రమైన అవమానాలు, ప్రతికూల పరిస్థితుల్లో విదేశాలకు వెళ్ళి సంపాదించిన అపారమైన జ్ఞాన సంపద, కోట్ల మంది దళితులు, పీడిత ప్రజల హక్కుల కోసం ఆయన హృదయంలో రగిలిన పోరాట స్ఫూర్తి ఇదంతా ఆయన గమనం. ఆ గమనమే ఒక సాధారణ మనిషిని యుగపురుషుడిగా మార్చింది. గమ్యం చేరినప్పుడు లోకం చప్పట్లు కొడుతుంది, కానీ గమనంలో తపించినప్పుడే మనిషి ఆత్మ పరిపక్వత చెందుతుంది. శ్రీనివాస రామానుజన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం చేరడం లేదా ప్రపంచ గుర్తింపు పొందడం ఆయన గమ్యం కావచ్చు. కానీ గణిత ప్రపంచాన్ని శాసించేలా, లండన్ చలిలో తిండి తిప్పలు మాని తన నోట్‌బుక్కులలో సమీకరణాలు నింపిన ఆ నిద్రలేని రాత్రుల గమనమే ఆయనను అమరుడిని చేసింది. మదర్ థెరీసా నోబెల్ వంటి అంతర్జాతీయ పురస్కారాలు ఆమె గమ్యాలు కావు. కోల్‌కతా వీధుల్లో దిక్కులేని రోగులకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆమె స్వహస్తాలతో చేసిన నిరంతర సేవ, ఆ కారుణ్య పయనమే ఆమెను దైవస్వరూపిణిగా నిలబెట్టింది. ప్రస్తుత ఆధునిక కాలంలో, ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో బతుకుతున్న నేటి యువతకు ఈ గమన సత్యం మరింత అవసరం. ఈ రోజుల్లో అందరికీ కేవలం ఫలితం లేదా సక్సెస్ మాత్రమే కనిపిస్తోంది. ఫలానా వ్యక్తి కొన్ని గంటల్లోనే క్రిప్టో కరెన్సీ ద్వారా లేదా వ్యాపారం ద్వారా కోటీశ్వరుడయ్యాడని, ఫలానా అమ్మాయి ఒక చిన్న రీల్ లేదా వీడియోతో ఒక్కరాత్రిలోనే సెలబ్రిటీ అయిపోయిందని పైపై మెరుపులు చూసి భ్రమపడుతుంటారు. కానీ ఆ విజయాల వెనుక, ఆ స్క్రీన్ వెనుక ఉన్న ఎన్నో ఏళ్ళ నిద్రలేని రాత్రులు, సమాజం నుండి ఎదుర్కొన్న తిరస్కరణలు, ఒంటరిగా కార్చిన కన్నీళ్ళు, ఓడిపోయినా మళ్ళీ లేచి నిలబడిన అజేయమైన ధైర్యం ఇవేవీ ఎవరికీ కనిపించవు. ఆ కంటికి కనిపించని అదృశ్య గమనమే ప్రతి ఒక్కరి అసలు కథ. కేవలం ఇతరుల గమ్యాన్ని, వారి లగ్జరీ జీవితాన్ని చూసి తొందరపడి స్ఫూర్తి పొందే వారు తమ జీవితంలో త్వరగా నిరాశకు లోనవుతారు. ఎందుకంటే, తమ సొంత ప్రయాణంలో (గమనంలో) ఏవైనా చిన్న చిన్న కష్టాలు, అడ్డంకులు ఎదురైనప్పుడు వారు వాటిని తట్టుకోలేక కుప్పకూలిపోతారు. ఫలితం కంటే ప్రక్రియ (ప్రాసెస్) ముఖ్యమని గ్రహించలేకపోతున్నారు. శ్రీమద్భగవద్గీతలో ఉపదేశిస్తూ శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి చెప్పిన శ్లోకం ఈ సందర్భంలో మనకు దిశా నిర్దేశం చేస్తుంది.

కర్మణ్యేవాధికారస్తేమాఫలేషుకదాచన దీని భావం ఏమిటంటే కర్మను (పనిని) శ్రద్ధగా చేయడం మాత్రమే నీ హక్కు, నీ బాధ్యత, దాని ద్వారా వచ్చే ఫలితంపై నీకు ఎలాంటి అధికారం లేదు. ఇది కేవలం ఏదో పూజలకు సంబంధించిన ఆధ్యాత్మిక వాక్యం కాదు, ఇది మానవ జీవితానికి సంబంధించిన అత్యంత లోతైన మనస్తత్వశాస్త్రం (Psychology). మన దృష్టి ఎల్లప్పుడూ కేవలం ఫలితం లేదా గమ్యం మీదే ఉన్నప్పుడు, మన మనస్సులో తెలియని ఆందోళన, భయం, ఒత్తిడి చోటుచేసుకుంటాయి. నేను అనుకున్నది సాధించకపోతే ఎలా? నా భవిష్యత్తు ఏమైపోతుంది? అనే ఆలోచనలు మనల్ని పీడిస్తాయి. అదే మన దృష్టి ప్రస్తుత గమనంపై, మనం చేసే పనిపై మాత్రమే లగ్నమైనప్పుడు, మనం ఎలాంటి ఒత్తిడి లేకుండా అత్యంత ఆనందంతో, ఉత్సాహంతో ఆ పనిని చేయగలుగుతాం. అప్పుడు విజయం అనేది మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. ఈ గమన సిద్ధాంతాన్ని మన నిత్య జీవితంలో ఆచరణలో పెట్టడానికి మూడు ముఖ్యమైన మార్గాలు ఉన్నాయి. ముందుగా, మనం ఏ చిన్న పని చేసినా ఆ పనిలో మన మనస్సును పూర్తిగా లగ్నం చేయడం నేర్చుకోవాలి. ఉదాహరణకు, ఇంట్లో వంట చేస్తున్నప్పుడు పూర్తి శ్రద్ధ వంటపైనే ఉండాలి అంతే కానీ ఫోన్ చూస్తూనో, టీవీ చూస్తూనో లేదా రేపటి గురించి ఆలోచిస్తూనో చేయకూడదు. పిల్లలతో ఆడుకుంటున్నప్పుడు పూర్తిగా వారితోనే గడపాలి ఆఫీస్ టెన్షన్లను మనసులోకి రానివ్వకూడదు. ఈ ప్రస్తుత క్షణంలో బతకడమే గమనాన్ని ఆస్వాదించడానికి మొదటి మెట్టు. గమ్యాన్ని మాత్రమే చూసే వ్యక్తికి ఒక చిన్న వైఫల్యం ఎదురైనా అది జీవితాంతం పెద్ద ముగింపులా కనిపిస్తుంది. కానీ గమనాన్ని ప్రేమించే వ్యక్తికి వైఫల్యం అనేది ఒక చక్కని పాఠం, ఒక కొత్త మలుపు, మరింత బలంగా ముందుకు వెళ్ళడానికి ప్రకృతి ఇచ్చిన ఒక అద్భుతమైన అవకాశం. థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనుగొనే క్రమంలో వేల సార్లు విఫలమయ్యాడు. అప్పుడు ఒక విలేకరి ఆయనను మీరు వేయి సార్లు విఫలమయ్యారు కదా, మీకు బాధగా లేదా? అని అడిగారు. దానికి ఎడిసన్ చిరునవ్వుతో నేను వేయి సార్లు విఫలం కాలేదు, బల్బు వెలగడానికి పని చేయని వేయి రకాల పద్ధతులను విజయవంతంగా కనుగొన్నాను అని సమాధానమిచ్చారు. ఇదే అసలైన గమన దృష్టి. జీవితం అనే ప్రయాణం ఒంటరిగా నడిచే చీకటి మార్గం కాదు. ఇది ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలతో కూడిన బంధాల సమాహారం. తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచి పెద్ద చేసే క్రమంలో అనుభవించే ఆ మధుర క్షణాలు, స్నేహితులతో కలిసి పంచుకున్న నవ్వులు, కష్ట సుఖాలు ఇవేవీ ఏ ఒక్క గమ్యానికి సంబంధించినవి కావు. ఇవన్నీ మన జీవిత ప్రయాణంలో దొరికే అమూల్యమైన రత్నాలు. వీటిని దాటేసి కేవలం డబ్బు, పదవి అనే గమ్యాల వెనుక పరిగెడితే చివరికి ఒంటరితనం మాత్రమే మిగులుతుంది. చివరగా చెప్పాలంటే, జీవితంలో గమ్యం అనేది ఎండమావి (మరీచిక) లాంటిది. ఒక గమ్యాన్ని చేరుకోగానే మన మనస్సు తృప్తి పడదు, వెంటనే మరొక కొత్త గమ్యాన్ని వెతుక్కుంటుంది. మానవ జీవితంలో ఇక నేను చేరుకున్నాను, ఇక్కడితో అంతా అయిపోయింది అని ఆగిపోయే స్థిర బిందువు ఎక్కడా ఉండదు. మరణం ఒక్కటే చివరి గమ్యం అనుకుంటే, ఆలోగా సాగే జీవితమంతా గమనమే కదా! అందుకే, జీవితం అంటే కేవలం గమ్యం కాదు గమనమే అసలైన జీవితం. ఈ ప్రయాణాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించిన వాడు, ప్రతి అడుగులోనూ ఆనందాన్ని, కొత్త అర్థాన్ని వెతికి పట్టుకున్నవాడు మాత్రమే నిజమైన సాధకుడు అవుతాడు. అతని జీవితమే పది మందికి ఒక గొప్ప ప్రేరణగా మారుతుంది. గమ్యం కన్నా గమనం గొప్పది అనేది కేవలం పుస్తకాల్లో ఉండే సూక్తి కాదు, ఇది మనం శ్వాసించాల్సిన జీవన వేదం. ఈ పరమార్థాన్ని సక్రమంగా అర్థం చేసుకుని, ఆచరించే వారి జీవితాలు ఎల్లప్పుడూ సుసంపన్నంగా, సార్థకంగా, నిరంతర ఆనందమయంగా ఉంటాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. మన ప్రయాణాన్ని ప్రేమిద్దాం, ప్రతి క్షణాన్ని పండగ చేసుకుందాం!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
మోరల్ ఫిలాసఫర్
9490754169

## చిన్నశేషుడిపై వెలసిన శ్రీ గోవిందుడి దివ్యమహిమ

### గోవింద నామస్మరణలతో మారుమోగిన తిరుపతి మాడవీధులు



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం శ్రీ గోవిందరాజస్వామివారు చిన్నశేష వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అనుగ్రహించారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు జరిగిన వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. ముందుగా గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తబృందాలు చెక్కభజనలు, కోలాటాలు, గోవింద నామసంకీర్తనలతో మాడవీధులను భక్తిరసమయం చేశాయి. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చిన్నశేష వాహనం దివ్యశోభను సంతరించుకుంది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పించి గోవిందుడిని దర్శించుకొని పరవశించారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడు “శేషి”, జగత్తు “శేషభూతం”గా భావించబడుతుంది. ఈ శేషశేషి తత్వానికి ప్రతీకగా చిన్నశేష వాహనం నిలుస్తుంది. చిన్నశేష వాహనసేవను దర్శించిన భక్తులకు కుండలినీ యోగసిద్ధి ఫలం లభిస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం. అనంతరం ఉదయం 10 గంటల నుండి కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ రకాల పండ్లరసాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ జరగనుండగా, రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈఓ నారాయణ చౌదరి, ఇతర అధికారులు, ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో మహానాడు ఏర్పాట్లు పరిశీలించిన: హోం మంత్రి అనిత

### లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




నక్కపల్లి(ప్రశ్న న్యూస్) హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి సంబంధించి కళ్యాణ మండపాలు, సభా ప్రాంగణాలు ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో మహానాడు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అనిత, క్లస్టర్ స్థాయిలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో రుద్ర లక్ష్మి, సాయి శంకర్ కుటుంబాలను స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించి చెక్కులను అందజేశారు.

### నక్కపల్లిలో మహానాడు పోస్టర్ ఆవిష్కరణ

నక్కపల్లిలోని మంత్రి నివాసం వద్ద మహానాడు పోస్టర్‌ను హోం మంత్రి అనిత ఆవిష్కరించారు.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, “టీడీపీ కుటుంబ సభ్యులు జరుపుకునే అతిపెద్ద పండుగ మహానాడు” అని పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పార్టీ ఆన్‌లైన్‌లో మహానాడు నిర్వహించిందని గుర్తుచేసిన ఆమె, ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి కూడా హైబ్రిడ్ విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు.

### రాష్ట్రవ్యాప్తంగా 1,840 క్లస్టర్లలో మహానాడు

సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తమ కాన్వాయ్‌లలో 50 శాతం వాహనాలను తగ్గించారని, అదే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఖర్చు తగ్గింపునకు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అనిత వెల్లడించారు. పాయకరావుపేట సీఐ నుంచి సమాచారం అందిన వెంటనే విచారణకు ఆదేశించామని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. “అత్యాచారం జరిగిందని పోలీసులు నిర్ధారించారా.? వైద్యులు నిర్ధారించారా.? అంటూ ప్రశ్నించిన మంత్రి, “మీ ఇళ్లల్లో కూడా ఆడపిల్లలు ఉన్నారు, ఆలోచనలు మారాలి” అని వ్యాఖ్యానించారు.

## డాక్టరేట్ పొందిన డాక్టర్ చెగ్గం సుస్మిత గంగపుత్రను అభినదించిన టి.జి.ఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



వరంగల్ (ప్రశ్న న్యూస్) రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులురాలిగా పనిచేస్తున్న చెగ్గం సుస్మిత గంగపుత్ర కాకతియ విశ్వ విద్యాలయం అర్ధ శాస్త్ర విభాగంలో మత్యకారుల జివన పరిస్థితుల పై ఒక అధ్యయనం అనే అంశం పై డాక్టర్ స్వరూప రాణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను కాకతియ విశ్వ విద్యాలయం నుండి డాక్టరేట్ పొందిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర చెగ్గం సుస్మిత గంగపుత్రకు అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ చెగ్గం సుస్మిత గంగపుత్ర సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులంలో జన్మించి అధ్యాపక వృత్తిలో కొనసాగుతూ మత్యకార స్థితి గతుల అధ్యయనం పై పరిశోధనకు గాను డాక్టరేట్ పొందడం అభినందనీయమంటూ రానున్న రోజులలో ప్రతిభ కలిగిన నిరుపేద గంగపుత్ర విద్యార్థుల విద్యా వికాసానికి కృషి చేయాలన్నారు

## కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజున చీరలు పంచిన ఏఐసీసీ నేత బిజ్జీ శత్రురావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ఫిషర్ మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జీ శత్రురావు' ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మహేష్ కుమార్ గౌడ్ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ అడ్మిన్ కుమార్ రావు, కాంగ్రెస్ నాయకులు రాము, సాబెర్, శ్రవణ్ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## గజ్వేల్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ డెవలప్మెంట్ నూతన కమిటీ ఎన్నిక

**కమిటీ అధ్యక్షులుగా మాస్కూరి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా బొల్లారం ఎల్లయ్య**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ డెవలప్మెంట్ కమిటీ నూతన కమిటీని ఘనంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా మాస్కూరి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా బొల్లారం ఎల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా మన్నె క్రిష్ణ, మాచపురం బాల్ నర్సయ్య, పొట్ట యాదగిరి ఎన్నికయ్యారు.సహాయ కార్యదర్శులుగా పంబాల ఎల్లయ్య, సల్ల నాగయ్య, మైస స్వామి ఎంపిక కాగా, కోశాధికారిగా పంబాల సత్యనారాయణను ఎన్నుకున్నారు. సలహాదారులుగా మల్కగళ్ళ నాగయ్య, దమ్మని మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా మైసని మల్లయ్య, సంఘయోళ్ల నర్సింలు, చింతకింది బాలయ్య బాధ్యతలు చేపట్టారు. గౌరవ అధ్యక్షులుగా ఆటకూరి రాములు గారిని ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గజ్వేల్ మండలంలోని అన్ని గ్రామాలను సందర్శిస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని అణచివేసే సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కట్టుబడి పనిచేస్తామని తీర్మానించారు.

## గజ్వేల్‌లో రేపటి నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**రైతు వద్ద ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేస్తాం : కలెక్టర్ కె. హైమావతి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో వడ్లు, మొక్కజొన్నలు మరియు సన్‌ఫ్లవర్ విత్తనాల కొనుగోళ్లకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేపటి నుంచే కొనుగోలు కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయని కలెక్టర్ వెల్లడించారు. లారీల కొరత కారణంగా కొంత ఆలస్యం జరిగినప్పటికీ, గజ్వేల్ ప్రాంతంలో కోతలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో కొనుగోళ్లు కూడా ఆలస్యమైనట్లు పేర్కొన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోళ్లు చేపట్టి రైతు వద్ద ఒక్క గింజ కూడా మిగలకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ చైర్మన్ ఒంటరి నరేందర్ రెడ్డి, డైరెక్టర్లు బూరుపల్లి కరుణాకర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ అధికారులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో కోటిలింగాల మహోత్సవానికి కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) హరిహర క్షేత్రం శ్రీ చిలుకేశ్వర ఆంజనేయ స్వామి దేవాలయం సన్నిధిలో జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు వారి దివ్య ఆశీస్సులతో కోటిలింగాల స్థాపన కార్యక్రమం జరుగుతుంది. అందులో భాగంగా ఆదివారం లింగాల బుక్కింగ్ మరియు కర్రపత్రం ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఏమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విచ్చేసి ఆవిష్కరణ చేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని రాజకీయాలకు అతీతంగా నాయకులు అందరూ ఆలయ నిర్మాణాన్నికి సహకరించాలని అన్నారు.ఆలయ పునర్నిర్మాణంలో భక్తులు , ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే అన్నారు.ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ అష్టోత్తర 108 లింగాలకు 2116/- రూ. సహస్ర 1008 లింగాలకు 21116/- రూ. చెల్లించి కోటిలింగాల స్థాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్ని ఆ భగవంతుడి కృపకు పాత్రులు కావాలని భక్తులకు తెలిపారు. కోటిలింగాల స్థాపన కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఆలయ పునర్నిర్మాణం కోసం విరాళాలు అందించాలని కోరారు. ఈకార్యక్రమానికి సభా అధ్యక్షులుగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్ వ్యవహరించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు బన్నాల ప్రవీణ్, ఆలయ మాజీ ప్రధాన కార్యదర్శి, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్ ఎలక్ట్రానిక్) అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, ఆలయ కమిటీ ప్రతినిధులు బూరుగల రమేష్ గౌడ్, జెల్లీ మొహన్, అమృత లావు, గోనె అంజయ్య, దేవసాని బాలచందర్, చాతరాసి సిధిరాజు, పాల్వంచ విఠల్, జయధీర్, కొంపల్లి రవీందర్, దేవుల పురుషోత్తం, ఆర్.బలరామ్, గూడ శ్రీశైలం, కావాలి నరసింహ, కొంగరి రామచంద్రర్, మాస శేఖర్, బోడ విద్యాసాగర్, శామీర్ పేట చంద్రయ్య, గుర్రాల మల్లేష్, పల్లె నర్సంగ్ రావు, ఈరేల్లీ రవీందర్ రెడ్డి, సంఘీ స్వామి యాదవ్, ఓర్సు శేఖర్, సీకూరీ కృష్ణ, అకిటి బాల్ రెడ్డి, అనసూయ రెడ్డి, వాసు, గజ్జల సత్యరాజ్, మడిపడేగ శ్రీనివాస్, రవీందర్ గౌడ్, జల్లీ ప్రశాంత్ , శ్రీనివాస్, వంశీ, మార్వాడీ అసోసియేషన్ సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెనే అధినేత డా.బంగారి స్వామికి గవర్నర్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక పురస్కారం

**వైద్య రంగం సహా సామాజిక సేవలోనూ ముందున్న ప్రొఫెసర్ డాక్టర్ స్వామి భవిష్యత్ లో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని ప్రకటన**

**(తేజవ్యాస్ బెస్త-- ప్రశ్న న్యూస్ బ్యూరో)**

కరీంనగర్ జిల్లా కేంద్రంగా గత రెండు దశాబ్దాలకుపైగా అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న రెనే గ్రూప్ ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామికి మరో అరుదైన గౌరవం దక్కింది.

### స్వామికి 2026 హెల్త్ కేర్ ఎక్సెలెన్సీ అవార్డ్..

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రతిష్టాత్మక “2026 హెల్త్ కేర్ ఎక్సెలెన్సీ అవార్డ్” అందుకొని డాక్టర్ స్వామి వైద్య రంగంలో తన ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారు.

జీ టెలివిజన్ గ్రూప్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని హోటల్ రాడిస్సన్ బ్లూ ప్లాజాలో ఘనంగా నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో రాజకీయ , వైద్య ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , జగిత్యాల శాసన సభ్యులు సంజీవ్ కుమార్, తదితరులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

### అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు..




గత 25 ఏళ్లుగా కరీంనగర్ కేంద్రంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బంగారి స్వామి, ముఖ్యంగా ఆర్థో వైద్య రంగంలో విశేష అనుభవంతో వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు కొనసాగిస్తున్నారు .

### జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు..

తెలంగాణతో పాటు బెంగళూరు, చెన్నై, పూణే, నాగ్‌పూర్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి కూడా రోగులు రెనే ఆస్పత్రిని ఆశ్రయించడం తమ సేవలపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

### సమాజానికి మరింత మెరుగైన సేవ చేస్తాం : డా. స్వామి

ఈ సందర్భంగా డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ, సమాజం తమపై ఉంచిన నమ్మకమే తమకు గొప్ప బలం అని



అన్నారు. వైద్య సేవలను కేవలం వృత్తిగా కాకుండా సేవాభావంతో కొనసాగిస్తున్నామని చెప్పారు. బంగారి లక్ష్మీ మైసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు, పేదలకు ఉచిత ఫెర్టిలిటీ చికిత్సలు నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. వైద్య సేవలతో పాటు సామాజిక బాధ్యతను సైతం సమర్థంగా నిర్వర్తిస్తున్న డాక్టర్ బంగారి స్వామికి లభించిన ఈ అవార్డు పట్ల వైద్య వర్గాలు , సామాజిక సంస్థలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం ఒక్కరి మృతి



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ స్మశాన వాటిక వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. సిరిసిల్ల వైపుగా వెళ్తున్న ఆటో సడన్ బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టి, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు క్రిందకి దూసుకెళ్లింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచిక్యంగా సడన్ బ్రేక్ వేసి రోడ్డు క్రిందకి ఆర్టీసీ బస్సును దించినా కూడా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బక్కి నర్సయ్య జంగంపల్లి గ్రామం బిక్కునూరు మండలం కామరెడ్డి జిల్లా చెందిన వ్యక్తి మరణించాడు. సిరిసిల్ల నెహ్రూ నగర్ లో కుటుంబీకులు నివసిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్లారిపేట ఎస్సై రాహుల్ రెడ్డి సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రధాన రహదారిపై ప్రమాదం చోటు చేసుకోవడంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే ట్రాఫిక్ ను క్రమ భద్రికరించారు.

## పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకుల సందడి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ పట్టణంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్లు గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, యెల్దండి నరసింహారెడ్డి, ఉపేందర్ రెడ్డి, రమేశ్ నాయక్, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, గాడిపల్లి శ్రీనివాస్, వంటేరు కొండల్ రెడ్డి, సమీర్, షరీఫ్ బాయ్, హసన్, అంజద్, అంజి, గుండు మల్లేశం, ఉమేష్ యాదవ్, జూపల్లి లక్ష్మణ్, నరేష్ గౌడ్, చెప్యాల శేఖర్, సబ్బని నరేష్, కొండల్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మహేష్ కుమార్ గౌడ్ దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## మంత్రి అచ్చం నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్. గణపతి శర్మ



నిమ్మాడ (ప్రశ్న న్యూస్) కొత్తమ్మ తల్లి ఆలయ ప్రధాన అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎస్. గణపతి శర్మ ని కూటమి ప్రభుత్వం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమించిన నేపథ్యంలో, బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన మంత్రి అచ్చెన్నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు ఎస్. గణపతి శర్మను శాలువాతో సన్మానించి అభినందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆ క్రెడిట్ మాత్రం దర్శకుడికే!



నందు, అవికా గోర్ జంటగా నటించిన విభిన్న కథాచిత్రం 'అగ్లీ స్టోరీ'. ప్రణవ స్వరూప్ దర్శకత్వంలో సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఈ సినిమా థాంక్స్ మీట్‌ని హైదరాబాద్‌లో శనివారం మేకర్స్ నిర్వహించారు. థియేటర్లలో స్పందన బాగుందని కథానాయకుడు నందు ఆనందం వ్యక్తం చేశారు. తన నటనను అంతా మెచ్చుకుంటున్నారని, భర్త క్రూరత్వాన్ని భరించాల్సిన అవసరం భార్యకు లేదని తెలిపే సినిమా ఇదని, ఈ సినిమాలో తన పాత్రకు ఇంత స్పందన రావడానికి కారణం దర్శకుడేనని, 95శాతం ఆ క్రెడిట్ అతనికే దక్కుతుందని నందు అభిప్రాయపడ్డారు. 'నా భార్య గీతామాధురికి ఈ సినిమాలోని పాటలు నచ్చాయి. ఒక హారర్ సినిమా చూసిన ఫీలింగ్ కలిగిందంటూ, తనకు నచ్చిన సన్నివేశాల గురించి చెప్పింది' అని తెలిపారు నందు. ఇంకా దర్శకుడు ప్రణవ స్వరూప్, బెక్కం వేణుగోపాల్ కూడా మాట్లాడారు.

### ఇప్పటి బాలీవుడ్ లో అలాంటి బంధాలకు

# చోటు లేదు

### – అమీషా పటేల్



బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్, చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి నటీనటుల మధ్య ఒకప్పటిలా నిజమైన స్నేహబంధాలు, అమాయకత్వం కనిపించడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదివారం తన తొలి సినిమా 'కహో నా... ప్యార్ హై' సహనటుడు హృతిక్ రోషన్‌తో దిగిన ఒక పాత ఫోటోను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఫుకెట్‌లో సినిమా షూటింగ్ సందర్భంగా ఒక రెస్టారెంట్‌లో హృతిక్‌తో కలిసి డిన్నర్ చేస్తున్న ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "ఒకప్పటి ఆ అమాయకత్వం, సహ నటుల మధ్య ఉండే నిజమైన బంధాలు ఇప్పటి బాలీవుడ్ లో లేవు. కానీ అలాంటి స్నేహాలు, బంధాలు ఏర్పరచుకోవడం నా అదృష్టం" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఫోటో, ఆమె వ్యాఖ్యలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇదే సమయంలో, భారతీయ సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న ట్రోలింగ్‌పై కూడా అమీషా స్పందించారు. హాలీవుడ్ స్టార్లతో పోలిస్తే మన దేశంలోనే సెలబ్రిటీలను ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకరినొకరు కిందికి లాగే మనస్తత్వం భారతీయులలో పెరిగిపోయింది. పెద్ద ఈవెంట్లలో మన స్టార్ల డ్రెస్సింగ్ లేదా వారి తీరును మనవాళ్లే టార్గెట్ చేయడం సిగ్గుచేటు" అని ఆమె ఎక్స్ వేదికగా విమర్శించారు.

## తప్పిపోయి రాలే.. వెతుక్కుంటూ వచ్చా



అఖిల్ అక్కినేని నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ లవ్‌స్టోరీ 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మురళీకిశోర్ అబ్బూరి దర్శకుడు. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు.

జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. మే 23తో అక్కినేని నాగార్జున సినీ ప్రయాణం ప్రారంభించి, ఆయన తొలి సినిమా 'విక్రమ్' విడుదలై 40ఏండ్లు పూర్తయిన సందర్భంగా 'లెనిన్' టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు.'మనోడు వస్తున్నాడు' అనే డైలాగ్‌తో 'లెనిన్' టీజర్‌పై హైప్ పెరిగిందని మేకర్స్ చెబుతున్నారు. 'నేను తప్పిపోయి రాలేదు మచ్చా.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చిన..' అని టీజర్‌లో చిత్తూరు యాసలో హీరో చెప్పిన డైలాగ్ ఆ పాత్రలోని ఇంటెన్సిటీని తెలియజేస్తున్నది. స్టేజ్‌పై ఎన్టీఆర్ పౌరాణిక డైలాగ్‌లను భాగ్యశ్రీ బోర్సే చెప్పిన తీరు, అఖిల్, భాగ్యశ్రీల కెమిస్ట్రీ యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. అఖిల్ బాడీ లాంగ్వేజ్, రగ్డ్ లుక్.. టీజర్‌లో హైలైట్‌గా ఉన్నాయి. శివాజీ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్, నిర్మాణం: మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, సితార ఎంటర్‌టైన్మెంట్స్.

## జిమ్‌లో శ్రియా రెడ్డి

### 'కర్రసాము' విన్యాసాలు..

నటి శ్రియా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన కొన్ని వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాలికి గాయమై కట్టు కట్టి ఉన్నప్పటికీ ఆమె జిమ్‌లో కఠినమైన కసరత్తులు చేస్తూ కనిపించారు. కేవలం వర్కవుట్లు మాత్రమే కాకుండా ఆమె చేసిన కర్రసాము విన్యాసాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. శ్రియా రెడ్డి మొత్తం మూడు వీడియోలను అభిమానులతో పంచుకున్నారు. మొదటి దాంట్లో ఒంటి చేత్తో కర్రను గిరగిరా తిప్పుతూ అదరగొట్టారు. రెండో వీడియోలో రెండు చేతులతో రెండు కర్రలను చాలా వేగంగా తిప్పుతూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇక మూడో దాంట్లో జిమ్‌లో కఠినమైన వర్కవుట్లు చేస్తూ కనిపించారు. ఆమె ఫిట్‌నెస్ పట్ల నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియోలతో పాటు శ్రియా రెడ్డి పెట్టిన పోస్ట్ నెటిజన్లను ఆలోచింపజేస్తోంది. "మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఒక్కో అడుగు వేస్తున్నా. మన బలాన్ని మనం మర్చిపోవడాన్నే 'హనుమాన్ కాంప్లెక్స్' అంటారు. జీవితం తిరిగి గుర్తుచేసే వరకు మన శక్తి ఏంటో మనకు తెలియదు. సముద్రాన్ని దాటే ముందు హనుమంతుడికి కూడా జాంబవంతుడు ఆయన శక్తిని గుర్తుచేయాల్సి వచ్చింది. మనల్ని మనం నమ్మడానికి కొన్నిసార్లు మనకూ ఒకరు కావాలి" అని ఆమె రాసుకొచ్చారు.



### విభిన్న కథతో

# సందిగ్ధం



నిహాల్, ప్రియాదేశ్‌పాగ్, అర్జున్ సీహెచ్, కాజల్ తివారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'సందిగ్ధం' చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో సంధ్య తిరువీధుల ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, కథలోని కొత్తదనం ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు.ఎన్నో కష్టాలను అధిగమించి సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తున్నామని హీరో నిహాల్ అన్నారు. ఈ సినిమాలో మ్యూజిక్‌తో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంటుందని సంగీత దర్శకుడు గౌతమ్ రవిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా:

## 'పెద్ది' ఈవెంట్‌లో జాన్వీ కపూర్ మెరుపులు..

## రాయల్ లుక్‌లో అదరగొట్టిన బ్యూటీ





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లు వేగం పుంజుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో శనివారం రాత్రి ఈ చిత్ర మ్యూజిక్ లాంఛ్ ఈవెంట్‌ను చిత్రబృందం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు హాజరైన కథానాయిక జాన్వీ కపూర్, తన అద్భుతమైన ఫ్యాషన్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా ఆమె ధరించిన లెహెంగా, ఈ సీజన్‌లో పెళ్లి చేసుకోబోయే వధువులకు ఒక అద్భుతమైన ఎంపికగా నిలుస్తుందని ఫ్యాషన్ వర్గాలు ప్రశంసిస్తున్నాయి. ఈ వేడుక కోసం జాన్వీ కపూర్, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన ముదురు వంగ పువ్వు రంగు (డీప్ పర్పుల్) లెహెంగా సెట్‌లో రాజకుమారిలా మెరిసిపోయారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో పర్యవేక్షణలో, సంప్రదాయ భారతీయ హస్తకళను ఆధునిక డిజైన్‌తో మిళితం చేసి, ఒక 'ఆధునిక భారతీయ యువరాణి' రూపాన్ని ఆవిష్కరించారు. ఈ లెహెంగా సెట్‌లోని క్రాప్డ్ బ్లౌజ్ జాన్వీ అందాన్ని మరింత పెంచింది. రౌండ్ నెక్‌లైన్, హాఫ్ స్లీవ్స్‌తో ఉన్న ఈ బ్లౌజ్‌పై సున్నితమైన సీక్విన్‌లు, క్లిష్టమైన జరీ ఎంబ్రాయిడరీ, చిన్న తెల్లని పూసలతో చేసిన అలంకరణ అద్భుతంగా ఉంది. ఈ డిజైన్ ఆమె మిడ్‌రిఫ్‌ను హైలైట్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జతగా, అదే రంగులో ఉన్న హై-వెయిస్టెడ్ ఏ-లైన్ లెహెంగా స్కర్ట్‌పై సంప్రదాయ గోల్డ్ జరీ వర్క్ చూపరులను కట్టిపడేసింది. ఇక, ఒక భుజంపై పిన్ చేసి, నడుము వద్దకు అందంగా చుట్టిన పల్చటి షిఫాన్ దుపట్టా ఆమె లుక్‌కు సంపూర్ణతను తెచ్చిపెట్టింది. కేవలం దుస్తులే కాదు, ఆమె ధరించిన ఆభరణాలు కూడా ప్రత్యేకంగా నిలిచాయి. 'మహేష్ నోతన్‌దాస్' జ్యువెలరీ నుంచి ఎంచుకున్న భారీ గోల్డ్ నెక్ పీస్, దానికి వేలాడుతున్న ముత్యాలు రాయల్ లుక్‌ను ఇచ్చాయి. బ్లౌజ్‌పై పొరలుగా అమర్చిన ముత్యాల బ్రూచ్‌లు, చెవులకు అలంకరించిన భారీ జుంకాలు, వాటికి అనుసంధానంగా ఉన్న కణ్ ఫూల్ (ఇయర్ కఫ్), చేతులకు ధరించిన హాథ్ ఫూల్ (హ్యాండ్ హార్నెస్), భారీ స్టేట్‌మెంట్ రింగ్... ఇలా ప్రతి ఆభరణం ఆమెను ఒక ఆధునిక యువరాణిలా మార్చేసింది. సౌరవ్ రాయ్, విధి పెరీరా తీర్చిదిద్దిన సంప్రదాయ జడ, మధ్యలో పాపిడితో నీట్‌గా కనిపించింది. ఇక మేకప్ విషయానికొస్తే, గోల్డ్ షిమ్మరింగ్ ఐషాడో, స్మడ్జ్ బ్లాక్ ఐలైనర్, నుదుట చిన్న వంగ పువ్వు రంగు బొట్టుతో ఆమె ముఖం ప్రకాశవంతంగా కనిపించింది. మొత్తం మీద, గ్లామర్‌తో కూడిన ఈ సంప్రదాయ లుక్‌లో జాన్వీ కపూర్ పెళ్లిళ్ల సీజన్‌లో జరిగే వేడుకలకు సరికొత్త ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచారు. కాగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## తెలంగాణ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఓకినావా స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థుల సత్తా

- వేదికపై విద్యార్థులను అభినందించిన కరీంనగర్ మేయర్ : కొలగాని శ్రీనివాస్
- జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించాలని మేయర్ ఆకాంక్ష



కరీంనగర్ / వేములవాడ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సూపర్ ఫైటర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో వేములవాడ ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు.స్వర్ణ,వెండి,కాంస్య పతకాలు సాధించిన బి. క్రాంతికుమార్, బి. తపస్వి, ఎండి. ఆయాష్, బీఆర్. వేదత, ఎస్కే సాహిల్, వి. అవతిక, ఎండి. వసీం, ఆహిల్, ఎస్. శ్రీవల్లి, ఈ. నిపుణశ్రీ, డి. భవ్యశ్రీ, ఎన్. మనస్వినిలను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్ వేదికపై అభినందించారు.విద్యార్థులు భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, సీనియర్ జర్నలిస్టు అబ్దుల్ మన్నాన్‌తో పాటు సీనియర్ కరాటే మాస్టర్లు కె. వసంత్‌కుమార్, మొండయ్య, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, ఇప్ప శ్రీనివాస్, కనకరపు రాజశేఖర్, వివిధ జిల్లాల కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

## ఘనంగా 2000- 2001ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- రెండు దశాబ్దాల అనంతరం కలిసిన ఎస్సెస్సీ విద్యార్థుల మిత్రబృందం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2000–2001 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. పాఠశాలలో చదివిన రోజుల అనుభవాలు, అప్పటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ స్నేహితులతో సరదాగా గడిపారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ జీవిత ప్రయాణాలను పరస్పరం పంచుకున్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

## తస్మాత్ జాగ్రత్త...!

## వేసవి వినోదం కారాదు విషాదం...!!

- వేసవి సెలవుల్లో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి
- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గితే



సిరిసిల్ల / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి సెలవులు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు బావులు, చెరువులు, వరద కాలువలు, కుంటల వద్దకు వెళ్లి ఈత నేర్చుకోవడం, ఈత కొట్టడం పట్ల ఆసక్తి చూపుతున్నారని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ క్రమంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారి తీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా నీటి వనరుల వద్దకు వెళ్లనీయకూడదని, ఈత రాని వారు లోతైన నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా బావులు, చెరువుల వద్ద ఆడుకోవడం ప్రమాదకరమని పేర్కొన్నారు.అలాగే గ్రామాల్లోని ప్రజలు ప్రమాదకరమైన నీటి ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే తాత్కాలిక కంచెలు ఏర్పాటు చేసి పిల్లలు అక్కడికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు సరదా కోసం ప్రాణాలను పణంగా పెట్టకుండా జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కలిసి పిల్లల భద్రతపై బాధ్యతగా వ్యవహరిస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- జర్నలిస్టుల సంక్షేమానికి పాలకులు చొరవచూపాలి
- 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన యూనియన్లో ఉండటం గర్వకారణం
- వృత్తికి కళంకం తెచ్చే కలుపు మొక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- టియూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ
- రాష్ట్ర కార్యదర్శి కట్టెకోల రాం నారాయణ





కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) నిరంతరం పోరాటాలు సాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అన్నారు. టియూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ పూర్వ అధ్యక్షులు ఇమ్మంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా మృతి చెందిన జర్నలిస్టు మిత్రుల జ్ఞాపకార్థం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన జర్నలిస్టు యూనియన్ సభ్యులుగా ఉండటం మనందరి అదృష్టమన్నారు. ఆ నాటి నుండి నేటి వరకు యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో బలమైన యూనియన్గా ఉందని, దేశంలోనే నెంబర్ వన్ సంఘంగా ముందుకు దూసుకుపోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల కోసం నిరంతరం ప్రభుత్వానికి వినతులు అందిస్తూనే ఉన్నామని, ఉమ్మడి తెలుగు రాష్ట్రం వ్యాప్తంగా ఇప్పటికే 47 వేల అక్రిడేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధి అయిన జర్నలిజం వృత్తి ఎంతో పవిత్రమైందని, అలాంటి వృతి కొందరి కారణంగా దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తికే కళాంకాన్ని తెచ్చే కలుపు మొక్కల భరతం పట్టాలని చెప్పారు. బ్లాక్ వెతికిపట్టుకుని వృత్తి నుండి తప్పించాలన్నారు. సమాజాన్ని జాగృతం చేయాలనే తపన జర్నలిస్టుల మదిలో అనునిత్యం ఉండాలని, అలాంటి వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి టియూడబ్ల్యూజే (ఐజేయు) నిత్యం ముందడుగులో ఉంటుందని, వృత్తిలో ఎదురయ్యే ఆటుపోట్లకు జర్నలిస్టులు భయపడకుండా నిజాన్ని నిర్భయంగా బహిర్గతం చేయాలన్నారు. కత్తిమీద సాములాంటిది ఇ జర్నలిస్టు వృత్తని, అలాంటి జర్నలిస్టులు సమాజ మేలుతో పాటు తమ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేయాలని టియూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ అన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా జర్నలిస్టులు ఉన్నారని, అలాంటి జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డుల కోసం యూనియన్ తొలినాళ్ల నుండి రాజీలేని పోరాటం సాగిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నోచుకోక పోవడంతో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్మంతర వద్ద మన గళం వినిపించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డితో కలిసి యూనియన్ అధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు వివరించామని, వాటి పరిష్కారానికి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి సాగుతోందని, నూతనంగా ఏర్పాటైన జిల్లా కార్యవర్గం ప్రతీ మూడునెలలకోసారి సమావేశాలు , సెమినార్లు నిర్వహించుకోవాలని, నానాటికి పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకుని వృత్తిలో నైపుణ్యాన్ని మరింతగా పెంచుకోవాలని సూచించారు.





### టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులుగా రత్నం

టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులుగా జాగు వెంకట రత్నం, ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్, కోషాధికారిగా శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా 3వ మహాసభ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్లో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు సాగిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల విలేకరుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రతీ మూడు నెలలకు ఓ సారి కమిటీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని మరింతగా మెరుగుపురుచుకునేందుకు సెమినార్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.
జిల్లాలో యూనియన్ బలోపేతానికి కలిసికట్టుగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కోశాధికారితో పాటు తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరహత్ అలీ, రాం నారాయణ , జర్నలిస్టు నాయకులు వేణు, వెంకట్రావు. ఏనుగు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్తో పాటు జిల్లాలోని జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. అదేవిదంగా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని కూడా ఈసందర్భంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్ నవీన్, ప్రధాన కార్యదర్శిగా జి నాగచంద్ర, కోషాధికారిగా ఎన్ రాజేష్ తో పాటు ఉపాధ్యక్షులుగా ప్రభుదాస్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా టి. రవికుమార్, శ్రీహరితో పాటు మరో 13 మందిని ఇసి మెంబర్స్ గా ఎనుకున్నారు.

## దేశ ఐక్యతకు మతమార్పిడులు ముప్పు

- మత మార్పిడిలను అరికట్టాలి - స్థాను మలయన్
- వేములవాడ లో ఘనంగా ధర్మ ప్రసార్ రాష్ట్ర సమావేశాలు ప్రారంభం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో విశ్వ హిందూ పరిషత్ ధర్మ ప్రసార్ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ఆరంభించి, భారతమాత చిత్రపటానికి పూలమాలలు అర్పించి సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన నూతన కార్యకర్తలను ఉద్దేశించి ప్రత్యేక సమావేశం చేపట్టారు.ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న స్థాను మలయన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న మతమార్పిడులను అరికట్టేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గర్వాపసి కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు విస్తరించాలని సూచించారు.మతమార్పిడుల వల్ల దేశ ఐక్యతకు భంగం కలుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నిజమైన అర్హులకు మాత్రమే రిజర్వేషన్ల ప్రయోజనాలు అందాలని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల సత్యం జీ, రామరాజు, వెంకటేశ్వరరావు జాదవ్, గడప కిషోర్ రావు, నాగుల రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనికి వెళ్లి వచ్చిన మహిళ వడదెబ్బతో మృతి



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం,కొత్త తాండ గ్రామపంచాయతీ పరిధిలోని చౌడు తాండకు చెందిన ధరావత్ బుజ్జి (42) వడదెబ్బకు గురై ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉపాధి హామీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన అనంతరం ఆమె అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆమె మృతి చెందిందని పేర్కొన్నారు.మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు ఇప్పటికే వివాహాలు కాగా, కుమారులకు ఇంకా పెళ్లిళ్లు కాలేదు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న బుజ్జి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.వడదెబ్బ కారణంగా ఆమె మృతి చెందిన నేపథ్యంలో సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అక్రమ మొరం రవాణా.. టిప్పర్ స్వాధీనం, డ్రైవర్‌పై కేసు

- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ స్టేజి వద్ద ఆదివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా మొరం రవాణా చేస్తున్న టిప్పర్ లారీని పట్టుకున్నారు. టీఎస్ 03 జె 4878 నంబర్ గల టిప్పర్ లారీ ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు డ్రైవర్ బొజ్జ అఖిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్వోసీ మంజూరు పత్రం అందజేత



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామాంతాపూర్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీకి చెందిన రామసాని భవాని అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1,50,000 వేల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు ఎల్వోసీ పత్రాన్ని కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి గౌరవ సభ్యులు మరియు వారి టీమ్ సభ్యులు కలిసి బాధితురాలికి అందజేశారు.ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సహకారంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ఎల్ఓసీ పొందడంతో పాటు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరయ్యిందని తెలిపారు.ఈ సందర్భంగా బాధితురాలికి నిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, రవికుమార్, సంజీవ, ఐలేష్ యాదవ్ , రమేష్ యాదవ్,శంకర్ ,రమేష్ శెట్టి, గోపాల్ , సర్వ సత్తయ్య యాదవ్,టీం సభ్యులు ఆర్. గోవింద్, జి.అశోక్, సి హెచ్ శ్రీనివాస్ గౌడ్, కొల్ల నవీన్ కుమార్, భూపతి నరసింహ, విద్యాసాగర్ , రామకృష్ణ, శివ, బాల కొమురయ్య, నరేష్, జగన్ , స్వామి, భూపతి రాము గౌడ్, శ్రీధర్ గౌడ్ ,చంద్రం చారి , గణేష్ , హుసేన్, సిరినగుల పరశు రామ్, కృష్ణ , సునీల్, మొగులయ్య, సమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

